క్లుప్తంగా

కనుల పండువగా పల్లకీ సేవ



పల్లకీలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం ఆలయ ప్రాంగణంలో కనుల పండువగా పల్లకీ సేవ నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులు చేసి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.

భక్తిశ్రద్ధలతో సరిగెత్తు



పీరును ఊరేగిస్తున్న భక్తులు

పాములపాడు: మండలంలోని లింగాల గ్రామంలో బాదర్ల స్వామి, జూటూరు గ్రామంలో మౌలాలి స్వామి సరిగెత్తు వేడుకలను ఆదివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. లింగాల గ్రామంలో పెద్ద సరిగెత్తు, జూటూరులో చిన్న సరిగెత్తు వేడుకలను నిర్వహించారు. భక్తులు స్వామి వార్లకు దట్టీలు, పూల షేరాలు, కాయ, కర్పూరాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. మరికొందరు కందుర్లు చేశారు. పీర్ల చావిడి నుంచి స్వామి వారి అగ్నిగుండం ప్రవేశం అనంతరం గ్రామంలోని పుర వీధుల వెంట సవారీ నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య ప్రజలు చిందులేస్తూ సరిగేసు వేడుకలను సంతోషంగా జరుపుకున్నారు.

మహానందిలో వైభవంగా శాకంబరి ఉత్సవం



శాకంబరి ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మహానంది: ఆషాఢమాసం పౌర్ణమి సందర్భంగా ఆదివారం శాకంబరి ఉత్సవం వైభవంగా జరిగింది. ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర అవధాని, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. నంద్యాలకు చెందిన మార్కెట్ ప్రసాద్ దంపతులు సుమారు వెయ్యి కిలోల కూరగాయలను విరాళంగా అందజేశారు.


శాకంబరిదేవీగా రాజరాజేశ్వరి



పూజలందుకుంటున్న రాజరాజేశ్వరిదేవి

ఆత్మకూరు: ఆషాఢమాసం పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఆదివారం రాజరాజేశ్వరిదేవిని శాకంబరిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారిని వివిధ కూరగాయలతో సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు.

గుండెపోటుతో ఎంపీఈఓ మృతి



సావిత్రిబాయి (ఫైల్)

ఆత్మకూరు: ఆత్మకూరులో ఎంపీఈఓగా పనిచేస్తున్న సావిత్రిబాయి(28) గుండెపోటుతో ఆదివారం మృతిచెందారు. ఆమె మృతిపై వ్యవసాయశాఖ అధికారులు, రాష్ట్ర ఎంపీఈఓల సంఘం నాయకులు సంతాపం తెలిపారు. చిన్న వయసులో గుండెపోటుతో మృతిచెందడం బాధాకరమన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

- ఆలయాల్లో విశేష పూజలు
- స్వామివార్లను దర్శించుకున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి–హేమారెడ్డి మల్లమ్మ మందిరం వద్ద, దక్షిణామూర్తి, వ్యాసమహర్షికి విశేష పూజలు జరిపించారు. ముందుగా అర్చకస్వాములు పూజా సంకల్పాన్ని పఠించారు. మహాగణపతి పూజ చేశారు. ఆ తరువాత దక్షిణామూర్తి, వ్యాసమహర్షి చిత్రపటాలకు షోడశోపచార పూజలు జరిపారు. గురుపరంపర మంత్రాలను పఠించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు పాల్గొన్నారు. సామాన్యుల కోసం వ్యాసమహర్షి మహాభారతాన్ని రచించారు. అందుకే మహాభారత గ్రంథం పంచమవేదంగా పేరొందింది. అలాగే లోకోద్ధరణ కోసం వ్యాసమహర్షి పద్దెనిమిది పురాణాలను కూడా రచించారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పాలకమండలి ఆధ్వ ర్యంలో ఆలయ ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 5 గంటలకు కాగడ హారతి, 6:30 నుంచి పంచామృతాభిషేకం, 9 గంటలకు సత్యవ్రతాలు, 12 గంటలకు హారతి, సాయంత్రం 6 గంటలకు హారతి, రాత్రి శేజ్‌హారతి నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి పల్లకీ ఉత్సవం, భజన కార్యక్రమాలు జరిగాయి.

● **వెలుగోడు:** పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఉదయం నుంచే పురోహితులు మురళి, యజ్ఞ నారాయణ శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామికి క్షీరాభిషేకం చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకుడు శివశంకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సీతామహాలక్ష్మమ్మ ఆధ్వర్యంలో విశేష పూజలు, వ్రతాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు యాదాటి రవి, ముక్కమళ్ల భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **ఆత్మకూరు:** పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని బాబాకు ఉదయం నుంచి సుప్రభాతసేవ, హారతి, అభిషేకాలు, పుష్పార్చన, సాయిసత్యవ్రతం నిర్వహించారు. మధ్యాహ్నం హారతి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయిబాబా రథాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. రాత్రి స్వామివారికి సేజ్ హారతి ఇచ్చారు.



వెలుగోడు: స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు,



శ్రీశైలం ఆలయంలో వ్యాసమహర్షి, దక్షిణామూర్తి చిత్రపటాలకు పూజలు చేస్తున్న అర్చకులు

● **పగిద్యాల:** గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని నెహ్రూనగర్ షిర్డీ సాయిబాబా ఆలయానికి సమీప గ్రామాలైన పీకే ప్రాగటూరు, పాత, కొత్త ముచ్చుమర్రి, పగిడ్యాల, బిజినివేముల, కొణిదేల, నాగటూరు నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. బాబా విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేసి భక్తితో పూజించారు. కర్నూలు సాయి సేవక్‌లు గీతాదేవి, శ్రీనివాస్, రోహిణిరెడ్డి భక్తుల చేత కాగడ హారతి, సుప్రభాతం, అభిషేకాలు, సామూహిక సాయి సత్యవ్రతాలు తదితర పూజా కార్యక్రమాలను జరిపించారు. ఈ సందర్భంగా కొణిదేల గ్రామానికి చెందిన తైలం వెంకటక్రిష్ణ సాయిబాబా విగ్రహానికి రూ.1.80 లక్షల విలువ చేసే పంచలోహంతో తయారు చేయించిన మకర తోరణాన్ని అందజేశారు. అలాగే పీకే ప్రాగటూరు గ్రామానికి చెందిన మండ్ల సురేష్‌నాయుడు రూ.1.50 లక్షల విలువ చేసే వెండి కిరీటాన్ని బాబాకు బహుకరించి భక్తిని చాటుకున్నారు. అనంతరం గ్రామ పెద్దలు, ప్రజలు భక్తులకు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. గురుపౌర్ణమి పూజల సందర్భంగా బాబా ఆలయం సాయి నామస్మరణతో మార్మోగింది.

● **పాములపాడు:** మండలంలోని జూటూరు గ్రామ శివారులో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య స్వామివారిని దర్శించుకున్నారు. పీఠాధిపతి రామానంద స్వామి సాదరంగా ఆహ్వానం పలికారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు విశేషంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

జూపాడుబంగ్లా: గురుపౌర్ణమి పురస్కరించుకొని మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తంగడంచె సమీపంలోని సాయిబాబా ఆలయం, తర్తూరు శ్రీలక్ష్మీ రంగనాథుని ఆలయం, జూపాడుబంగ్లా వెంకటేశ్వరస్వామి ఆలయం, అభయాంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. తంగడంచె సాయిబాబా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామివారిని దర్శించుకొని తన్మయత్వం చెందారు.

● **కొత్తపల్లి:** మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో వెలసిన సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పురోహితులు సూర్యప్రకాశ్ బాబా విగ్రహానికి పాలాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, విశేష అలంకరణ, మంగళ హారతి వంటి విశేష పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు బాబాను దర్శించుకొని పూజాక్రతువులు నిర్వహించారు.



కొత్తపల్లి: సాయిబాబా విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న పురోహితుడు



పాములపాడు: స్వామి వారికి హారతి ఇస్తున్న పీఠాధిపతి రామానందస్వామి





పగిద్యాల: వెండి కిరీటంతో దర్శనమిస్తున్న షిర్డీ సాయిబాబాను పూజిస్తున్న భక్తులు, తంగడంచలో సాయినాథుడికి పూజలు చేస్తున్న భక్తులు



శ్రీశైలం: బాబాకు అభిషేకం చేస్తున్న భక్తులు

రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

నందికొట్కూరు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం వెంటనే విడుదల చేయాలని సీపీఐ, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని రైతు సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాగానే రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌లో సాగువేసిన పంటలకు ఎరువులు, పురుగు మందులు కొనేందుకు నగదు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావొస్తుందని ప్రభుత్వం సాయం అందించకపోవడంతో ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎం కిసాన్ పథకంతో సంబంధం లేకుండా సీఎం చంద్రబాబు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు సోమన్న, సుధాకర్, షేక్షావలి, మౌలాలి, తదితరులు ఉన్నారు.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

జూపాడుబంగ్లా: గ్రావెల్, కంకర, ఇసుక తరలించే టిప్పర్లు తప్పనిసరిగా పైన గ్రీన్‌మ్యాట్ లేక టార్పాలిన్ పట్ట కప్పుకొని వెళ్లాలనే హైకోర్టు ఆదేశాలను కొందరు యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ రవాణా చేస్తున్నారు. దీంతో వాహనాలు వెళ్లినంత దూరం రోడ్డు వెంట ఇసుక, కంకర, గ్రావెల్ పడ్తున్నాయి. దీంతో వెనకాల వచ్చే ద్విచక్రవాహనాల దారులు స్కిడ్ అయ్యి ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే ప్రయాణికుల కళ్లల్లో ఇసుక, దుమ్ము పడుతుండటంతో రెప్పపాటులో ప్రమాదాలకు గురవుతున్నారు. టార్పాలిన్ కప్పకుండా ఇసుక, గ్రావెల్, కంకరను తరలించే వాహనాలను సీజ్‌చేసి జరిమానా విధించాలని రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారులకు ఆదేశాలున్నా అమలయ్యేది అంతంతమాత్రమే. దీంతో నిబంధనలు పట్టించుకోకుండా టిప్పర్ డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.



టార్పాలిన్ లేకుండా కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్

వేధింపుల కేసు నమోదు

మహానంది: గాజులపల్లె గ్రామానికి చెందిన అత్తమామలతో పాటు బంధువులు వేధిస్తున్నారన్న కోర్టు ఉత్తర్వుల మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ ఆదివారం తెలిపారు. ఆయన వివరాల మేరకు.. గాజులపల్లె గ్రామానికి చెందిన ఇందిరాబాయికి వైఎస్సార్ జిల్లా కోడూరు మండలం అట్లూరు గ్రామానికి చెందిన శ్రీకాంత్‌నాయక్‌తో 2023 మే నెలలో వివాహం అయ్యింది. అయితే భర్త శ్రీకాంత్‌నాయక్‌తో పాటు అత్తా, మామ, కుటుంబ సభ్యులు అదనపు కట్నం పేరుతో వేధిస్తుండడంతో కోర్టును ఆశ్రయించారన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు భర్త, అత్తామామలతో పాటు మరొకరిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుళాయిలు ఏర్పాటు చేయాలి

నందికొట్కూరు: పట్టణంలోని సంతగేట్ స్కూల్‌లో జీఎల్ఆర్‌సీ వాటర్ ట్యాంక్‌కు కుళాయిలు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు పక్కీర్‌సాహెబ్ కోరారు. ఆదివారం పట్టణంలోని సంతగేట్ ఉర్దూ స్కూల్‌లో నిరూపయోగంగా ఉన్న జీఎల్ఆర్‌సీ వాటర్ ట్యాంక్‌ను సీపీఎం నాయకులు, విద్యార్థులు చూపించారు. జీఎల్ఆర్‌సీ వాటర్ ట్యాంక్ పగిలిపోయిందన్నారు. నీటిని వదిలిన సమయంలో వృథాగా పోవడంతో విద్యార్థులకు తాగు నీరు ఇబ్బందిగా మారిందని చెప్పారు. నూతన జీఎల్ఆర్‌సీ ట్యాంక్‌ను ఏర్పాటు ఏర్పాటు చేయాలని కోరారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

మహానంది: ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆధ్యాత్మికవేత్త చిరంజీవి స్వామి తెలిపారు. మహానంది సమీపంలోని జినశంకర తపోవనంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ సెక్రటరీ హనుమంతరెడ్డి, రిటైర్డ్ స్టేషన్‌మాస్టర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే బుక్కాపురంలోని ఉమామహేశ్వర గురుపీఠం, సాయిదేవాలయం, అల్లీనగరం సాయిబాబ ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

జూపాడుబంగ్లాలో 2.8 మిల్లీమీటర్ల వర్షం

జూపాడుబంగ్లా: మండలంలో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు కురిసిన వర్షం 2.8 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. నందికొట్కూరు నియోజకవర్గంలోని మిడ్తూరులో మండలంలో అత్యధికంగా 4.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా పాములపాడులో అత్యల్పంగా 2.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. అలాగే నందికొట్కూరులో 4.2 ఎం.ఎం, పగిడ్యాలో 3.2 ఎం.ఎం, జూపాడుబంగ్లాలో 2.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన

పగిద్యాల: ఇటీవల కురుస్తున్న వర్షాలకు విద్యుత్ వినియోగదారులు భద్రత చర్యలపై అవగాహన కలిగి ఉండాలని మండల విద్యుత్ ఏఈ క్రాంతికుమార్ సూచించారు. ఆదివారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వినియోగదారుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులు ఇళ్లలో అంతర్గత వైరింగ్‌కు ఉపయోగించే వైర్లు, స్విచ్‌లు, హోల్డర్లు వంటి వాటికి ఐఎస్ఐ నాణ్యత కలిగిన వాటినే ఉపయోగించాలన్నారు. ఇంట్లోని స్విచ్ బోర్డులను భద్రత ప్రమాణాలు పాటిస్తూ తగినంత ఎత్తులో అమర్చుకోవాలన్నారు. విద్యుత్ సర్వీస్‌కు ఉపయోగించే వైర్ లోడ్‌కు అనుగుణంగా తగు కేపాసిటీతో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇలా చేయడం వల్ల విద్యుత్ సరఫరాలో తలెత్తే అంతరాయం, లో ఓల్టేజీ హెచ్చుతగ్గులను అరికడుతుందని చెప్పారు. ఇంటి విద్యుత్ సర్వీస్‌కు, ఇంట్లో ఉపయోగించే పరికరాలకు తప్పనిసరి ఎర్త్‌పైప్ ద్వారా ఎర్తింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షం పడినప్పుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు (సపోర్టు వైర్) ముట్టుకోరాదన్నారు. విద్యుత్ స్తంభాలకు, తీగలకు దగ్గరలో ఏలాంటి ఇంటి నిర్మాణాలు చేపట్టరాదని ఒకవేళ చేపడితే తప్పనిసరిగా విద్యుత్ సంస్థ అనుమతి తీసుకోవాలన్నారు. తడి కాళ్లు, తడి చేతులతో విద్యుత్ బోర్డులు, స్విచ్‌లు వేయరాదని స్పష్టం చేశారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రైవేటు వ్యక్తులకు చెప్పరాదన్నారు. వినియోగదారులు తగు జాగ్రత్తలను పాటిస్తూ విద్యుత్ ప్రమాదాలను నివారించాలని కోరారు.

ఎల్లమ్మ గుడిలో పట్టపగలే చోరీ

జూపాడుబంగ్లా: మండలంలోని పి.లింగాపురం గ్రామ సమీపంలో ఉన్న ఎల్లమ్మగుడిలో ఆదివారం మధ్యాహ్నం పట్టపగలే చోరీ జరిగినట్లు పూజారి పాండు తెలిపారు. ఆయన ఆదివారం తెలిపిన వివరాల మేరకు... ఉదయం ఆరు గంటలకు గుడికి వెళ్లి అమ్మవారికి పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. 11.30 గంటల సమయంలో మధ్యాహ్నం భోజనం చేసేందుకు పాండు ఇంటికి వచ్చాడు. తిరిగి సాయంత్రం 5 గంటలకు గుడికి వెళ్లగా తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించాడు. గుడిలోకి వెళ్లి చూడగా అమ్మవారి మెడలోని రెండు బంగారు పుస్తెలు (అరతులం), హుండీని పగులగొట్టి అందులోని డబ్బులు, రెండు కంచు గంటలను గుర్తు తెలియని దుండగులు దోచుకెళ్లినట్లు గుర్తించాడు. వెంటనే జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ లక్ష్మీనారాయణకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఆలయం వద్దకు చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

వాల్మీకి వర్గం అభ్యున్నతికి కృషి



మీనిగ రామకృష్ణ

కొత్తపల్లి: వాల్మీకి, బోయ వర్గం అభ్యుదయానికై తన వంతు కృషి చేస్తానని ఏపీ వీబీఎస్ నంద్యాల జిల్లా కార్యదర్శి మీనిగ రామకృష్ణ పేర్కొన్నారు. ఆయన ఆదివారం ఏపీ వాల్మీకి బోయ సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శిగా ఎంపికైన సందర్భంగా మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మారుమూల మండలమైన కొత్తపల్లి నుంచి తనను నంద్యాల జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. మండలంలోని వాల్మీకుల హక్కుల కోసం, జాతి అభ్యున్నతి కోసం తన వంతు కృషిచేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు సంఘం నేతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే వరకు పోరాడతామని స్పష్టం చేశారు.

14 ఏళ్లుగా నిరుపయోగం

- సహకార సొసైటీల్లో తుప్పు పడుతున్న ట్రాక్టర్లు
- 2010లో ఒక్కో ట్రాక్టర్ రూ.5 లక్షలు వెచ్చించి కొనుగోలు
- వినియోగంలోకి తెస్తే పేద రైతులకు ప్రయోజనం

జూపాడుబంగ్లా: అధికారులు తమ జేబుల్లోని సొమ్మును వెచ్చించాల్సి వస్తుందనుకున్నారో ఏమోగానీ సహకార సొసైటీలకు మంజూరైన ట్రాక్టర్లను 14 ఏళ్లుగా ఒక్కరోజుకూడా ఉపయోగించకుండా వదిలేశారు. 2010 ఆగస్టులో నియోజకవర్గంలోని 80బన్నూరు, పగిడ్యాల, బ్రాహ్మణకొట్కూరు, పీర్‌సాహెబ్‌పేట, ఓర్వకల్లులోని సహకార సొసైటీలకు రాష్ట్రీయ కృషివికాస్ యోజనా పథకం కింద ఒక్కో సొసైటీకి రూ.5 లక్షల చొప్పున ఐదు సొసైటీలకు రూ.25 లక్షల నిధులు వెచ్చించి ఐదు ట్రాక్టర్లను అప్పటి కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ట్రాక్టర్లతో సొసైటీల్లో సభ్యత్వం ఉండి ఐదెకరాల్లోపు పొలం కలిగిన సన్న, చిన్నకారు రైతులకు రాయితీపై పొలాల్లో వ్యవసాయం చేయించుకొనే వెసలుబాటు కల్పించింది. సొసైటీలకు ట్రాక్టర్లు మంజూరై 14 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటిదాకా ఒక్క రైతు పొలంలో సేద్యం చేసిన దాఖలాల్లేవు. దీనికి కారణం ట్రాక్టర్ల పర్యవేక్షణ బాధ్యత వ్యవసాయ అధికారులు, సహకార సొసైటీ అధికారుల మధ్యనుండటంతో పాటు జిల్లా అధికారులు స్పష్టమైన గైడ్‌లైన్స్ ఇవ్వలేదంటూ చెబుతున్నారు. దీంతో సొసైటీ, వ్యవసాయ అధికారులు ట్రాక్టర్లను తుప్పు పట్టేలా నిరుపయోగంగా ఉంచారు. మిడ్తూరు, ఓర్వకల్లు, నందికొట్కూరు, పీర్‌సాహెబ్‌పేట సొసైటీల్లోని ట్రాక్టర్లు టైర్లు ఊడిపోయి తుప్పుపట్టి పనికిరాకుండా పోయాయి. 14 ఏళ్లుగా సొసైటీలకు మంజూరైన ట్రాక్టర్లను కనీసం రిజిస్ట్రేషన్ కూడా చేయించలేదంటే అధికారులు ఎంతటి నిర్లక్ష్య స్థితిలో ఉన్నారో అర్థమవుతోంది. ప్రస్తుతం ఎకరా పొలంలో సేద్యం చేయించుకోవాలంటే రూ.1,500 నుంచి రూ.2000 వరకు చెల్లించాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. సొసైటీకి మంజూరైన ట్రాక్టర్లతో రాయితీపై సేద్యం చేయిస్తామని అధికారులు పేర్కొనడంతో తాము సంతోషించామని ఎప్పుడో మంజూరైన ట్రాక్టర్లను ఇప్పటిదాకా వినియోగించకపోవడంతో వ్యవసాయ అధికారుల నిర్లక్ష్య వైఖరిని ఎత్తిచూపుతోందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా సహకార సొసైటీ అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకొని ట్రాక్టర్లను వినియోగంలోకి తెచ్చి చిన్న, సన్నకారు రైతులకు రాయితీపై వ్యవసాయ పనులు చేయించుకొనేలా అవకాశం కల్పించాలని సహకార సొసైటీలో సభ్యత్వం ఉన్న రైతులు కోరుతున్నారు.



జూపాడుబంగ్లా సహకార సొసైటీలో తుప్పుపట్టి నిరుపయోగంగా మారిన ట్రాక్టర్

అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు అందలేదు



ప్రతి సొసైటీకి ఒకటి చొప్పున ఐదు సొసైటీలకు ఐదు ట్రాక్టర్లను గతంలో కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు మంజూరు చేశారు. వాటిని ఇప్పటిదాకా రిజిస్ట్రేషన్ చేయించలేదు. ట్రాక్టర్ పర్యవేక్షణ బాధ్యతలు వ్యవసాయ అధికారులు, సొసైటీ అధికారులకు అప్పగించారు. అయితే ట్రాక్టర్ల వినియోగంపై జిల్లా సొసైటీ అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వలేదు. దీంతో 14 ఏళ్లుగా ట్రాక్టర్లు నిరుపయోగంగా ఉన్నాయి. మా సొసైటీ ట్రాక్టర్ కొంచెం బాగుంది. మిగతా సొసైటీల్లోని ట్రాక్టర్లు పనికిరాకుండా పోయాయి.

– చంద్రశేఖర్‌గౌడు, సొసైటీ సీఈఓ, 80బన్నూరు సహకార సొసైటీ

హంతకులను కఠినంగా శిక్షించాలి

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామానికి చెందిన చాకలి చిన్న లింగస్వామిని కిరాతకంగా హత్య చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అఖిల భారత రజక సంఘం, ధోబీ మహా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు జిల్లెల్ల శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆదివారం ఇస్కాల గ్రామానికి చేరుకొని మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మండల కేంద్రంలో మహాత్మా జ్యోతీరావుపూలే విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇద్దరు బాలికల ఉన్నత చదువుల బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలన్నారు. నిందితులను పట్టుకోవడంలో ఆలస్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆ సంఘం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మౌలాలి, ధర్మయ్య, రామకృష్ణ, శ్రీరాములు, నాగభూషణం, మద్దిలేటి, ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు

వీధికుక్కలతో బెంబేలు

శ్రీశైలంప్రాజెక్ట్: మండల కేంద్రమైన సున్నిపెంటలో వీధి కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇటీవల కాలంలో వీధికుక్కలు పలువురిని గాయపరిచాయి. గ్రామంలో వందల కొద్దీ కుక్కలు పెరిగిపోవడంతో వీధుల్లోకి వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలను చూస్తే వారిని కరిచేందుకు కుక్కలు ముందుకు దూకుతున్నాయి. ద్విచక్రవాహనాలపై వెళ్లేవారిని కూడా వెంటాడుతున్నాయి. వర్షాకాలం కావడంతో కుక్కకాటు వల్ల రేబిస్ వ్యాధి సోకే అవకాశాలు ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. పంచాయితీ అధికారులు వీధికుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

